# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 10 సంచిక : 24 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ మంగళవారం 29 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :24 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA TUE 29 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# మంగళగిరిలో 372 మందికి ఇంటి పట్టాలు పంపిణీ

- కుంచనపల్లిలో 372 మందికి ఉచితంగా ఇంటి పట్టాలు పంపిణీ చేసిన మంత్రి నారా లోకేశ్
- ఇప్పటికే రెండు విడతల్లో 5,636 మందికి పట్టాలు అందించినట్లు వెల్లడి
- రూ.2 వేల కోట్ల విలువైన భూములకు ఆస్తి హక్కులు కల్పించినట్లు ప్రకటన
- వచ్చే ఏడాది 100 పడకల ఆసుపత్రి అందుబాటులోకి తెస్తామని హామీ
- 2029 నాటికి నియోజకవర్గంలోని అర్హులందరికీ పట్టాలు అందిస్తామని లోకేశ్ వెల్లడి



పెన్ పవర్ డెస్క్:మంగళగిరి నియోజకవర్గంలో 80 శాతం పట్టాల సమస్య పరిష్కారమైందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కుంచనపల్లిలో 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా 372 మందికి ఉచితంగా ఇంటి పట్టాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన మెజారిటీ కారణంగానే నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సొంత నిధులు కూడా ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు."ఇప్పటికే రెండు విడతల్లో 5,636 మందికి పట్టాలు ఇచ్చి రూ.2 వేల కోట్ల విలువైన భూములకు ఆస్తి హక్కులు కల్పించాం. మంగళగిరిలో పునాది వేసిన ఈ కార్యక్రమాన్ని విశాఖ,

- మిగతా 2లో



# ఏనుగుల సంచారంపై డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

- చిత్తూరులో సంచరిస్తున్న ఏనుగులను అడవిలోకి మళ్లించాలని పవన్ కల్యాణ్ ఆదేశం
- ఆపరేషన్ కోసం ముసలమడుగు నుంచి కుంకీ ఏనుగులను తీసుకురావాలని సూచన
- పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని స్పష్టం
- మానవ-ఏనుగు ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం

పెన్ పవర్ డెస్క్:చిత్తూరు జిల్లాలోని పలు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను, రైతులను భయాందోళనలకు గురిచ ేస్తున్న ఏనుగుల గుంపును వెంటనే అడవిలోకి సురక్షితంగా మళ్లించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ముసలమడుగు శిబిరం నుంచి కుంకీ ఏనుగులను రంగంలోకి దించాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు. సోమవారం పడిపుట్లబైలు సమీపంలో ఏనుగుల సంచారంపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.గత 15 రోజులుగా 11 ఏనుగులతో కూడిన గుంపు, దాని నుంచి విడిపోయిన మరో రెండు ఏనుగులు పడిపుట్లబైలు పంచాయతీ పరిధిలోని పుండ్లవల్లపల్లి, నడింపల్లి, కొండకిందపల్లి గ్రామాల్లో సంచరిస్తున్నాయని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఏనుగులు వ్యవసాయ పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, ఒక ఏనుగుల గుంపు రహదారి దాటి మంగళంపేట బీట్‌లోకి ప్రవేశించగా, మరో రెండు ఏనుగులు చిత్తూరు వైపు కదులుతున్నాయని

- మిగతా 2లో

## ప్రతిభకు ప్రోత్సాహం.. అంధుల క్రికెట్‌కు మంత్రి నారా లోకేశ్ భరోసా

- మంత్రి లోకేశ్‌తో సమావేశమైన భారత అంధుల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజయ్ రెడ్డి
- ఏపీలో అంధుల క్రికెట్‌ను బలోపేతం చేయడంపై కీలక చర్చ
- క్రీడాకారులకు పూర్తి మద్దతు ఇస్తామని లోకేశ్ భరోసా
- అంధ క్రికెటర్ల కోసం ప్రత్యేక మైదానాలు ఏర్పాటు చేస్తామని హామీ
- వారి ప్రతిభ, సంకల్పానికి అండగా నిలుస్తామన్న మంత్రి

- మిగతా 2లో





## బంగాళాఖాతంలో మరో వాయుగుండం.. ఏపీకి వర్ష సూచన

- కోస్తాంధ్ర, రాయలసీమలో తేలికపాటి వర్షాల అంచనా
- గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం
- రానున్న 72 గంటల్లో బంగ్లాదేశ్ వైపు తీరం దాటే సూచన
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

- మిగతా 2లో




## తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత

- నాలుగేళ్ల నిరంతర విద్య నిబంధన తప్పనిసరి అని పునరుద్ఘాటన
- స్థానికతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- రాష్ట్రపతి ఉత్తర్వులను, తెలంగాణ జీవోను సమర్థించిన న్యాయస్థానం

పెన్ పవర్ డెస్క్:తెలంగాణలో స్థానికత (లోకల్ స్టేటస్) అర్హత సాధించడానికి నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాస నిబంధన తప్పనిసరి అని సుప్రీంకోర్టు మరోసారి

- మిగతా 2లో

# జగన్ పాలనలో బీసీలకు ద్రోహం

- జగన్ పాలనలో బీసీలకు తీవ్ర ద్రోహం జరిగిందన్న మంత్రి కొల్లు రవీంద్ర
- బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని ప్రకటన
- 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి కుదించారని వైసీపీ ప్రభుత్వంపై విమర్శ
- బీసీల అభ్యున్నతికి బడ్జెట్‌లో రూ.32,534 కోట్లు కేటాయించామని వెల్లడి
- కూటమి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పునరుద్ధరణకు చిత్తశుద్ధితో ఉందని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:జగన్ ప్రభుత్వ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా నిలుస్తోందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సోమవారం

- మిగతా 2లో

## 15 వేల ప్రమోషన్లు ఇచ్చాం.. ఇంకా ధర్నాలెందుకు?

### సచివాలయ ఉద్యోగుల డిమాండ్లపై మంత్రి స్వామి

- ఉద్యోగులను వైఎస్ జగన్ రెచ్చగొడుతున్నారని మంత్రి స్వామి ఆరోపణ
- అక్రమ ధర్నాలు, ఒత్తిళ్లు సహించేది లేదని హెచ్చరిక
- నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టీకరణ
- రెండు క్యాజువల్ లీవులకు ఉన్నతాధికారుల అనుమతి అవసరం లేదన్న మంత్రి



పెన్ పవర్ డెస్క్:గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇప్పటికే 15 వేల మందికి పైగా ప్రమోషన్లు ఇచ్చామని, సమస్యలు పరిష్కరిస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని రాష్ట్ర మంత్రి డీఎస్‌బీవీ స్వామి స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అక్రమంగా ధర్నాలు చేస్తే సహించేది లేదని

- మిగతా 2లో



## ఆరో తరగతికి త్రిభాషా విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలి

పెన్ పవర్ డెస్క్: సీబీఎస్ఈ బోర్డు పరిధిలో ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్న విద్యార్థులకు త్రిభాషా విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని సుప్రీం కోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. ఈ ఏడాది 7, 8, 9వ తరగతి విద్యార్థులకు కల్పించినట్లుగానే ఈ విధానం నుంచి ఆరో తరగతికి కూడా మినహాయింపు ఇవ్వాలని ఆదేశించింది. 2027 ఏప్రిల్ 1 నుంచి త్రిభాషా విధానాన్ని అమలు చేయాలని సూచించింది. సీబీఎస్ఈ త్రిభాషా విధానంలోని అంశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. అకస్మాత్తుగా సీబీఎస్ఈ భాషా విధానం మార్చడంపై సుప్రీం కోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తింది. ఇప్పటికే ఇతర భాషలు ఎంచుకున్న విద్యార్థులు మధ్యలో మరో భాషకు మారాలంటే ఇబ్బంది పడే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఈ విషయంపై పిటిషన్ దాఖలు చేసిన పాఠశాలలను

- మిగతా 2లో

# యూపీఐ ఛార్జీలపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ.. అక్టోబర్ 15 నుంచి అమలు

- యూపీఐ లావాదేవీలపై 0.4% ఛార్జీల విధింపుపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ
- అక్టోబర్ 15 నుంచి కొత్త నిబంధనల అమలుకు మార్గం సుగమం
- రూ.2,000 దాటిన మర్చంట్ చెల్లింపులపై మాత్రమే ఈ ఛార్జీ వర్తింపు
- సాధారణ, వ్యక్తిగత లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవని స్పష్టత
- ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలని కేంద్రం, ఆర్‌బీఐకి కోర్టు నోటీసులు



పెన్ పవర్ డెస్క్:యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే నిర్దిష్ట లావాదేవీలపై 0.4% ఛార్జీలు విధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అక్టోబర్ 15 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో వాటిని నిలిపివేయాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై నేడు విచారణ చేపట్టింది. ఈ నిర్ణయంతో షెడ్యూల్ ప్రకారమే కొత్త ఛార్జీల అమలుకు మార్గం సుగమమైంది.ప్రధాన న్యాయమూర్తి

- మిగతా 2లో

## హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం..

- హైదరాబాద్ మణికొండలో చెడ్డీ గ్యాంగ్ ప్రత్యక్షం
- అపార్ట్‌మెంట్‌లో చోరీకి పాల్పడి మహిళపై దాడి
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ముఠా సభ్యుల వీడియోలు
- కేసు దర్యాప్తునకు మూడు ప్రత్యేక పోలీస్ బృందాల ఏర్పాటు
- సెక్యూరిటీ గార్డుల పాత్రపై ఆరా తీస్తున్న పోలీసులు 2లో



## కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం.. నవంబర్ 1 నుంచి కఠిన నిబంధనలు

- ఢిల్లీలో వాయు కాలుష్య నియంత్రణకు ముందస్తు చర్యలు
- నవంబర్ 1 నుంచి రెట్టింపు కానున్న పార్కింగ్ ఛార్జీలు
- ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలు
- నిర్మాణ, కూల్చివేత పనులపై పూర్తిగా నిషేధం
- ఫిబ్రవరి 28 వరకు అమలులో ఉండనున్న నిబంధనలు - మిగతా 2లో



## 'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం.. మేనమామలా మారిన సీఎం విజయ్

- 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని ప్రారంభించిన సీఎం విజయ్
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం
- మధురై రాజాజీ ఆసుపత్రిలో చిన్నారులకు స్వయంగా ఉంగరాలు తొడిగిన సీఎం
- కొందరు చిన్నారులకు సంప్రదాయబద్ధంగా నామకరణం కూడా చేసిన విజయ్ - మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# జనసేన దూకుడు.. బలం ఎవరిది ఎంతో తెలుస్తుందా?

జనసేన ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల షేరింగ్ పై పట్టుబట్టే అవాకశముంది. లేదంటే స్నేహపూర్వక పోటీ చేస్తామని బహిరంగంగానే ప్రకటించింది. ఈ నేపథ్యంలో జనసేన డిమాండ్లకు టీడీపీ నుంచి సానుకూలత వస్తుందా? లేదా? అన్నది కూడా ఏపీలో చర్చనీయాంశమైంది. ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, ప్రాంతాల వారీగా పటిష్ట వ్యూహంతో ముందుకు వెళ్లాలని ఎ జనసేన నిర్ణయించింది. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మరియు రాజకీయ వ్యవహారాల కమిటీ మార్గదర్శకాల ప్రకారం జనసేన అనుసరిస్తున్న ప్రధాన వ్యూహాలు ఎలా ఉంటాయన్నది ఇప్పుడు కూటమిలోని మిత్రుల మధ్య చర్చనీయాంశమైంది. ఎక్కువ మంది టీడీపీ ఎమ్మెల్యేలున్నారు. వారు తమ నియోజకవర్గం పరిధిలో జనసేనకు వాటా ఇచ్చేందుకు అంగీకరించరు. హైకమాండ్ బలవంతం పై బయటకు అంగీకరించినా ఎన్నికల్లో మనస్ఫూర్తిగా పనిచేయరు.

**టీడీపీ, జనసేన సోషల్ మీడియా వార్...**

జనసేన పార్టీ తమకు ప్రాధాన్యత కల్పించకపోతే పోటీకి దిగుతామని ప్రకటించింది. అయితే పోటీకి దిగితే ఎవరి బలం ఏంటో బయటపడుతుందని కొందరు టీడీపీ అభిమానులు సోషల్ మీడియా వేదికగా అప్పుడే జనసేన పై కామెంట్స్ చేస్తున్నారు. 2014, 2024 ఎన్నికల్లో కూటమి గెలుపునకు తామే కారణమని చెప్పుకుంటూ తిరుగుతున్న జనసేన నోరు మూయించాలంటే ఒకరకంగా ఒంటరిగా ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయనిస్తే అసలు బలం తెలుస్తోందని కొందరు నేరుగా కామెంట్స్ పెడుతున్నారు. దీంతో రెండు పార్టీల మధ్య సోషల్ మీడియా వార్ మొదలయినట్లే కనిపిస్తుంది. ఒకవేళ హైకమాండ్ నిర్ణయం తీసుకున్నా క్షేత్రస్థాయిలో కలసి పనిచేసే అవకాశాలు మాత్రం ఒకరికొకరు కనిపించని పరిస్థితి ఆల్రెడీ ఇప్పటికే ఏర్పడిందన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. ఇది వైసీపీకి కొంత మేరకు ప్రయోజనం చేకూరుతుందన్న భయం ఉన్నప్పటికీ ఎవరి బలం? ఏంటో తెలిస్తేనే ..గుప్పిట తెరిస్తేనే కదా? అంటున్నారు టీడీపీ నేతలు. ఇలా స్థానిక సంస్థల ఎన్నికలలో మిత్రుల మధ్య కొంత గ్యాప్ ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**జనసేన మాత్రం ముందుకే...**

మరొకవైపు జనసేన ప్రత్యేక కమిటీల ఏర్పాటు చేసింది. స్థానిక ఎన్నికల నిర్వహణ, సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను నియమించారు.పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఈ కమిటీలు పనిచేస్తాయి.గ్రామ, వార్డు స్థాయిల్లో పార్టీ యంత్రాంగాన్ని ఇవి బలోపేతం చేస్తాయి. అసెంబ్లీ ఎన్నికల నాటి ఫార్ములా కాకుండా, స్థానిక పరిస్థితులకు తగినట్లుగా వ్యూహం మార్చారు.ప్రతి ప్రాంతంలో పార్టీ సామాజిక, సంస్థాగత బలాలను అంచనా వేస్తున్నారు.గ్రౌండ్ రియాలిటీ ఆధారంగా పోటీ చేసే స్థానాలను ఖరారు చేస్తున్నారు. ప్రతిష్టాత్మకమైన మేయర్ మరియు కీలక స్థానాలపై జనసేన ప్రత్యేక దృష్టి పెట్టింది.పోటీ చేసే ప్రతి చోటా విజయమే లక్ష్యంగా శ్రేణులను సన్నద్ధం చేస్తున్నారు.కూటమి సమన్వయంకూటమి భాగస్వామ్య పక్షాలతో సమన్వయ కమిటీల ద్వారా చర్చలు జరుపుతున్నారు.సీట్ల సర్దుబాటు మరియు కేటాయింపులపై పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయమే తుదినిర్ణయంగా ఉంటుందని స్పష్టం చేశారు. మరి చివరకు ఏం జరుగుతుందన్నది చూడాలి.

# హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం..

హైదరాబాద్ నగరంలో మరోసారి చెడ్డీ గ్యాంగ్ కలకలం రేపింది. మణికొండలోని ఒక అపార్ట్‌మెంట్‌లోకి చొరబడిన ఈ ముఠా సభ్యులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.వివరాల్లోకి వెళితే, నిన్న తెల్లవారుజామున మణికొండలోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి చెడ్డీ గ్యాంగ్ సభ్యులు ప్రవేశించారు. నివాసంలోకి చొరబడి దొంగతనానికి పాల్పడుతుండగా, ఒక మహిళ వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన దుండగులు ఆమెపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఆరుగురు సభ్యులు అపార్ట్‌మెంట్‌లోని ఒక బ్లాక్‌లో సంచరిస్తున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఈ వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.

ఈ ఘటనపై సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు, స్థానిక సెక్యూరిటీ గార్డులకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనతో చుట్టుపక్కల అపార్ట్‌మెంట్ల వాసులు భయాందోళన చెందుతున్నారు.

# 'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం.. మేనమామలా మారిన సీఎం విజయ్

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేడు మధురైలో 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరాన్ని అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. మధురైలోని ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా సీఎం విజయ్ ఈ బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టారు.బిస్కెట్ కలర్ చొక్కా, పంచె ధరించిన సీఎం విజయ్, వేదికపై ముగ్గురు శిశువులకు స్వయంగా బంగారు ఉంగరాలు తొడిగి పథకాన్ని ప్రారంభించారు. తల్లులను ఆప్యాయంగా కుర్చీల్లో కూర్చోబెట్టి, పక్కనే ఉండి చిన్నారుల వేళ్లకు జాగ్రత్తగా ఉంగరాలు తొడిగారు. అనంతరం ఆయన వేదిక దిగి కింద కూర్చున్న మరో 12 మంది తల్లులు, వారి శిశువుల వద్దకు వెళ్లారు. అక్కడ చిన్నారులను చేతుల్లోకి తీసుకుని, వారి తల్లిదండ్రులతో ఆప్యాయంగా మాట్లాడారు.ఈ సందర్భంగా కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు పేరు పెట్టాలని సీఎం విజయ్‌ను కోరారు. వారి అభ్యర్థనను మన్నించిన ఆయన, చిన్నారులను ఎత్తుకుని సంప్రదాయబద్ధంగా మూడుసార్లు పేరును ఉచ్చరించి నామకరణం చేశారు. ఈ భావోద్వేగపూరిత క్షణాల్లో అక్కడున్న వారంతా హర్షం వ్యక్తం చేశారు.

అనంతరం తల్లులతో సెల్ఫీలు దిగి, కరచాలనం చేసి వారిని ఉత్సాహపరిచారు. ఆ తర్వాత ఆసుపత్రిలోని ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ వార్డును సందర్శించి, అక్కడ మరో 10 మంది శిశువులకు బంగారు ఉంగరాలు అందించారు. వైద్యుల సమక్షంలో చిన్నారులతో, వారి తల్లిదండ్రులతో సరదాగా గడిపారు.అంతకుముందు ఉదయం 11 గంటలకు చెన్నై నుంచి మధురై విమానాశ్రయానికి చేరుకున్న సీఎం విజయ్‌కు పార్టీ కార్యకర్తలు, అభిమానులు వందలాదిగా తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. ఆయన కాన్వాయ్ ఆసుపత్రికి వెళ్లే దారి పొడవునా ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలు నిలబడి పూలవర్షం కురిపించారు. రాజాజీ ఆసుపత్రి వద్ద వాహనం దిగి, జనసందోహం మధ్య నడుచుకుంటూనే వేదిక వద్దకు చేరుకున్నారు. దారిలో ఆసుపత్రి సిబ్బంది, ప్రజలకు అభివాదం చేస్తూ, పలుచోట్ల ఆగి వారితో ఫొటోలు దిగారు. సీఎం రాకతో ఆసుపత్రి పరిసరాలు జనసంద్రంగా మారాయి.

# జగన్ పాలనలో బీసీలకు ద్రోహం

- మొదటి పేజి తరువాయి

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల పాలనలో బీసీలను వెన్నుపోటు పొడిచిన వైసీపీ నాయకులు, ఇప్పుడు దొంగ నాటకాలు ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు.

వైసీపీ ప్రభుత్వం బీసీలను రాజకీయంగా అణగదొక్కే ఉద్దేశంతోనే స్థానిక సంస్థల్లో ఉన్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి కుదించిందని మంత్రి ఆరోపించారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16,800 మంది బీసీలు తమ రాజకీయ ప్రాతినిధ్యాన్ని కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తమ ప్రభుత్వం బీసీలకు తిరిగి 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించేందుకు చిత్తశుద్ధితో ఉందని, ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి, అందుకు అనుగుణంగా కార్యాచరణను రూపొందిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

బీసీల రక్షణ కోసం ప్రత్యేకంగా "బీసీ రక్షణ చట్టాన్ని" తీసుకురానున్నట్లు కొల్లు రవీంద్ర ఈ సందర్భంగా ప్రకటించారు. నారా లోకేశ్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే ఈ చట్టానికి సంబంధించిన ముసాయిదా సిద్ధమైందని ఆయన వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల

అభ్యున్నతి కోసం బడ్జెట్‌లో రూ.32,534 కోట్లను కేటాయించిందని, వారి ఆర్థిక స్వావలంబన కోసం పటిష్ఠమైన చర్యలు తీసుకుంటోందని వివరించారు. జగన్ పాలనలో బీసీలపై దాడులు జరిగినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని, తమ ప్రభుత్వం మత్స్యకారులు, చేనేత కార్మికులు, వడ్డెరలు వంటి అన్ని వర్గాలకు ప్రత్యేక పథకాల ద్వారా భరోసా కల్పిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

# ప్రతిభకు ప్రోత్సాహం.. అంధుల క్రికెట్‌కు మంత్రి నారా లోకేశ్ భరోసా

ఆంధ్రప్రదేశ్‌లో అంధుల క్రికెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని, క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. భారత అంధుల క్రికెట్ జట్టుకు మూడు ప్రపంచకప్‌లు అందించిన మాజీ కెప్టెన్, అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి సోమవారం మంత్రి లోకేశ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అంధుల క్రికెట్ ఎదుర్కొంటున్న సవాళ్లు, క్రీడాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై వారు సుదీర్ఘంగా చర్చించారు.ఈ భేటీ అనంతరం మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. అజయ్ కుమార్ రెడ్డిని కలవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్‌లో అంధుల క్రికెట్‌ను మరింత బలోపేతం చేయడం, రాష్ట్ర, దేశ స్థాయిల్లో ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులకు మద్దతుగా నిలవడం, ప్రత్యేకించి దృష్టి లోపం ఉన్న క్రికెటర్ల కోసం ప్రత్యేక క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం వంటి కీలక అంశాలపై చర్చించాం" అని లోకేశ్ తెలిపారు.

అంధ క్రీడాకారుల ప్రతిభ, అకుంఠిత దీక్ష, వారు సాధించిన విజయాలు ఎంతో స్ఫూర్తిదాయకమని మంత్రి కొనియాడారు. "వారి ప్రతిభకు తగిన ప్రోత్సాహం, అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా నిలుస్తుంది" అని ఆయన తన పోస్టులో స్పష్టం చేశారు. అజయ్ రెడ్డి వంటి క్రీడాకారులతో నేరుగా చర్చించి, ప్రభుత్వపరంగా పూర్తి మద్దతు ప్రకటించడం పట్ల రాష్ట్రంలోని అంధ క్రీడా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం.. నవంబర్ 1 నుంచి కఠిన నిబంధనలు

ప్రతి ఏటా శీతాకాలంలో తీవ్ర వాయు కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వం ముందస్తు నియంత్రణ చర్యలకు ఉపక్రమించింది. కాలుష్య తీవ్రతను తగ్గించే లక్ష్యంతో 2026 నవంబర్ 1వ తేదీ నుంచి కఠిన నిబంధనలను అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా పార్కింగ్ ఛార్జీలను రెట్టింపు చేయడంతో పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

కొత్త నిబంధనల ప్రకారం, నవంబర్ 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు కేవలం 50 శాతం సిబ్బందితోనే కార్యకలాపాలు సాగించాలి. మిగిలిన 50 శాతం మంది ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ వెసులుబాటు కల్పించాలని స్పష్టం చేసింది. వీటితో పాటు, నగర వ్యాప్తంగా భవన నిర్మాణ, కూల్చివేత పనులపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిషేధం విధించింది. వాహనాల వినియోగాన్ని నియంత్రించేందుకు ఈ కాలంలో పార్కింగ్ ఫీజులను కూడా రెట్టింపు చేయనున్నట్లు వెల్లడించింది.

శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడం, పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాలలో పంట వ్యర్థాలను కాల్చడం, వాహన కాలుష్యం, నిర్మాణ రంగ ధూళి, దీపావళి బాణసంచా, పారిశ్రామిక ఉద్గారాల వంటి కారణాలతో ఢిల్లీ నగరం ప్రతి ఏటా గ్యాస్ ఛాంబర్‌ను తలపిస్తోంది. దట్టమైన పొగమంచు కారణంగా ప్రజలు శ్వాసకోశ సమస్యలు బారిన పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ చర్యల ద్వారా శీతాకాలంలో కాలుష్య తీవ్రతను కొంతమేరకైనా తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# యూపీఐ ఛార్జీలపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ.. అక్టోబర్ 15 నుంచి అమలు

- మొదటి పేజి తరువాయి

సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సహా ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ముఖ్యంగా ఈ కొత్త ఛార్జీల విధింపునకు గల ప్రాతిపదికను వివరిస్తూ అఫిడవిట్ సమర్పించాలని కేంద్రాన్ని కోరింది.

**కొత్త నిబంధనల ప్రకారం ఛార్జీల స్వరూపం**

సెప్టెంబర్‌లో జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం, వ్యక్తుల నుంచి వ్యాపారులకు (పీ2పీ) చేసే రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై 0.4% 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) వర్తిస్తుంది. రూ.75,000, ఆపైబడిన లావాదేవీలకు గరిష్ఠంగా రూ.300 ఛార్జీ ఉంటుంది. అయితే, ఈ ఛార్జీల ప్రభావం సాధారణ వినియోగదారులపై ఎక్కువగా ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**ఎవరికి మినహాయింపు?**

వ్యక్తుల మధ్య (పీ2పీ) జరిగే యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు.

వ్యాపారులకు చేసే రూ.2,000 లోపు చెల్లింపులు పూర్తిగా ఉచితం.

యూపీఐ క్యూఆర్ కోడ్‌ల ద్వారా నెలకు రూ.1 లక్ష వరకు చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు సున్నా-ఎండీఆర్ నిబంధన వర్తిస్తుంది.

అత్యావసర సేవలకు ఫ్లాట్‌గా రూ.5, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలకు 0.02% చొప్పున తక్కువ ఛార్జీలు వర్తిస్తాయి.

**ఇది పన్ను కాదు, సెటిల్‌మెంట్ ఫీజు: కేంద్రం**

కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపిస్తూ,

ఈ కొత్త ఛార్జీల వల్ల దాదాపు 96% మర్చంట్ లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే పన్ను కాదని, కేవలం పేమెంట్ సిస్టమ్‌లో భాగమైన ఒక సెటిల్‌మెంట్ ఫీజు మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ ఛార్జీలు నేరుగా వినియోగదారుల నుంచి వసూలు చేయరని ఆయన వివరించారు. ప్రస్తుతం స్టే ఇచ్చేందుకు నిరాకరించినప్పటికీ, కేంద్రం ఇచ్చే వివరణ అనంతరం సుప్రీంకోర్టు ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోనుంది.

# 15 వేల ప్రమోషన్లు ఇచ్చాం.. ఇంకా ధర్నాలెందుకు?

- మొదటి పేజి తరువాయి

ఆయన గట్టిగా హెచ్చరించారు.సోమవారం అమరావతిలో మంత్రి స్వామి మీడియాతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల ఆందోళనలపై ప్రభుత్వ వైఖరిని వెల్లడించారు. గత ప్రభుత్వం సరైన సర్వీస్ రూల్స్ లేకుండా నోటిఫికేషన్లు ఇచ్చిందని, తమ ప్రభుత్వం వాటిని సరిదిద్దిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో సచివాలయ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించినట్లు వివరించారు. దీనిలో భాగంగా రెండు క్యాజువల్ లీవులను ఉన్నతాధికారుల అనుమతి లేకుండా వాడుకునే వెసులుబాటు కూడా కల్పించామని చెప్పారు.ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనల వెనుక ఎవరున్నారనే దానిపై విచారణ జరుపుతామని చెబుతూనే, ఈ ఆందోళనలకు జగనే కారణమని మంత్రి స్వామి ఆరోపించారు. "గతంలో రూ.15,000 జీతానికి రెండేళ్లు పనిచేసినప్పుడు నిరసన తెలపని వారు, ఇప్పుడు ఎందుకు ఆందోళన చేస్తున్నారని ప్రశ్నించారు. గత పీఆర్సీలో వీరిని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు?" అని నిలదీశారు.

కొన్ని డిమాండ్లపై మంత్రి స్పష్టత ఇచ్చారు. నోషనల్ ఇంక్రిమెంట్లు ఎవరికీ ఇవ్వడం సాధ్యం కాదని, కాబట్టి సచివాలయ ఉద్యోగులకు కూడా ఇవ్వలేమని తేల్చిచెప్పారు.ద

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగానే చూస్తున్నామని, గత ప్రభుత్వం నియమించిందన్న వివక్ష తమకు లేదని అన్నారు. వారి కోసం ప్రత్యేకంగా ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేసిందే తమ ప్రభుత్వమని గుర్తుచేశారు. వారి సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, అయితే ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

# మంగళగిరిలో 372 మందికి ఇంటి పట్టాలు పంపిణీ

- మొదటి పేజి తరువాయి

విజయవాడతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నాం. వచ్చే ఏడాది 100 పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తెస్తాం. రానున్న ఎన్నికల్లోగా ప్రతి ఇంటికీ తాగునీరు, భూగర్భ డ్రైనేజీ సౌకర్యం కల్పిస్తాం. కేంద్రం పరిధిలోని భూముల సమస్యలపై కూడా సంప్రదింపులు జరుపుతున్నాం. 2029 నాటికి నియోజకవర్గంలో అర్హులందరికీ పట్టాలు అందిస్తాం" అని లోకేశ్ తెలిపారు.

# ఆరో తరగతికి త్రిభాషా విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలి

- మొదటి పేజి తరువాయి

సంప్రదించి, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఇందుకోసం ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు.

# తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత

- మొదటి పేజి తరువాయి

స్పష్టం చేసింది. ఈ నిబంధన ఏకపక్షంగా ఉందంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ, రాష్ట్రపతి ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది.జెల్లా అంకిత అనే విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్ల పాటు తెలంగాణలో విద్యాభ్యాసం చేసి ఉండాలన్న నిబంధనను పిటిషనర్ సవాల్ చేశారు. అయితే, ఈ వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత జీవోను సమర్థించింది.ఎంబీబీఎస్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు స్థానిక రిజర్వేషన్ పొందాలంటే, విద్యార్థి క్వాలిఫైయింగ్ పరీక్షకు ముందు కనీసం నాలుగేళ్ల పాటు తెలంగాణలోనే చదివి ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో జస్టిస్ బి.ఆర్. గవాయ్ ధర్మాసనం వెలువరించిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, దానిని న్యాయస్థానం పునరుద్ఘాటించింది.ఈ తీర్పుతో తెలంగాణలో స్థానికతకు సంబంధించిన నిబంధనలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడినట్లయింది. నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాసం అనే నిబంధన చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుందని, దీనిని కచ్చితంగా పాటించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# ఏనుగుల సంచారంపై డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

- మొదటి పేజి తరువాయి

అధికారులు పేర్కొన్నారు. ఈ ఏనుగుల సంచారం వల్ల పాకాల, పులిచెర్ల, చంద్రగిరి మండలాల ప్రజలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, మానవ-ఏనుగు ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. "ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. అటవీ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖలు, హనుమాన్ బృందాలు సమన్వయంతో పనిచేయాలి. క్షేత్రస్థాయి బృందాలు నిరంతరం నిఘా ఉంచి, ప్రమాదం పొంచి ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలి" అని ఆయన స్పష్టం చేశారు.ఏనుగుల వల్ల పంట నష్టపోయిన రైతులకు తక్షణం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చూసుకుంటూనే, ఏనుగులను సురక్షితంగా తిరిగి అటవీ ప్రాంతంలోకి మళ్లించే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజల భద్రత, పంటల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఉద్ఘాటించారు.

# బంగాళాఖాతంలో మరో వాయుగుండం.. ఏపీకి వర్ష సూచన

బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన వాయుగుండం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని అంచనా వేసింది.

మయన్మార్, అండమాన్ దీవుల సమీపంలో ఏర్పడిన ఈ వాయుగుండం, ప్రస్తుతం అండమాన్‌లోని మాయాబందర్‌కు 580 కిలోమీటర్ల దూరంలో తూర్పు-ఈశాన్య దిశలో కేంద్రీకృతమై ఉంది. ఇది వాయవ్య దిశగా బంగ్లాదేశ్ వైపు కదులుతోంది. రానున్న 12 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా బలపడి, సుమారు 72 గంటల్లో బంగ్లాదేశ్ తీరాన్ని తాకవచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.ఈ వాయుగుండం ప్రభావంతో ప్రభావిత ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవలే ఉత్తరాంధ్ర తీరంలో కళింగపట్నం వద్ద ఒక తీవ్ర వాయుగుండం తీరం దాటడంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలతో పంట నష్టం జరిగిన నేపథ్యంలో తాజా హెచ్చరిక ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఆనంద సాగర్ కు అభినందనలు తెలిపిన కూటమి నాయకులు



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 28:** ఇటీవల టిడిపి అధిష్టానం ఆదేశానుసారం పి.గన్నవరం నియోజకవర్గ ఇన్ చార్జ్ నియమింపడిన మోకా ఆనంద సాగర్ ను కూటమి నాయకులు అభినందనలు తెలిపారు. స??తానిక పద్మాజీ టవర్స్ ఆవరణలో ఆనందసాగర్ ను పూల మాల శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మైపాల తాతాజీ, మేడిది శ్రీ ను, నాగవరపు అన్నవరం, సుబ్బరాజు, మట్ట నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## తుఫాన్ బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం, ఉచిత రేషన్



కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 28 :** తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు, ముంపునకు గురైన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం, ఉచిత రేషన్ పంపిణీకి ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలిసి సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన, ముంపు బాధిత కుటుంబాలకు సభ్యుల సంఖ్య ఆధారంగా రూ.1,000 నుంచి రూ.3,000 వరకు ఆర్థిక సాయం అందించాలన్నారు. ప్రతి బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యంతో పాటు కందిపప్పు, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, పంచదార తదితర నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలని, మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల బియ్యం అందించాలని ఆదేశించారు. కాకినాడ గ్రామీణం, గొల్లప్రోలు, తొండంగి మండలాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో సుమారు 1,500 కుటుంబాలకు ఆశ్రయం కల్పించినట్లు తెలిపారు. రానున్న రెండు రోజుల్లో ముంపునీరు పూర్తిగా తగ్గేలా చర్యలు తీసుకోవాలని, నీరు తగ్గిన వెంటనే పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి, వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, రెవెన్యూ, మున్సిపల్, వైద్య, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేసి బాధితులకు సకాలంలో సహాయం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో డాక్టర్ డి. తిప్పే నాయక్, జడ్పీ సీఈవో వి.వి.ఎస్. లక్ష్మణరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.







## వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మురళీ కృష్ణంరాజుకు పలువురు నాయకులు పరామర్శ.





**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్, 28:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గం వైసీపీ నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజుకు సోమవారం పలువురు నాయకులు పరామర్శించారు. మురళీకృష్ణంరాజు తండ్రి ముదునూరి రామరాజు ఇటీవల కాలం చేశారు.

దీంతో విషయం తెలుసుకున్న జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకవర్గ సభ్యులు, తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ,మాజీ మంత్రి, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దాడిశెట్టి రాజా, మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్, తోట నరసింహం, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జగ్గంపేట నియోజకవర్గం వైసీపీ నాయకులు జ్యోతుల రామస్వామి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి పరిశీలకులు ఒమ్మి రఘురామ్,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెదపాటి అమ్మాజీ, వైసిపి జిల్లా ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ శెట్టిబత్తుల కుమార్ రాజా, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి యడ్ల తాతాజీ, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, తుని నియోజకవర్గం వైసీపీ పరిశీలకులు వాసిరెడ్డి జమీల్, ప్రత్తిపాడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉమ్మడి వెంకట్రావు, జగ్గంపేట నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర, వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు జున్నూరి రామారావు,(బాబి ) జనసేన పార్టీ నాయకులు చదలవాడ బాబి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు, పశ్చిమగోదావరి జిల్లా వైసిపి నాయకులు, మురళీకృష్ణంరాజు అభిమానులు భారీగా తరలివచ్చి ముదునూరి రామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం మేకకుండా, మురళీ కృష్ణంరాజు కుటుంబానికి తమ తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలియజేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతున్ని ప్రార్థించారు.

## విద్యార్థుల సౌకర్యార్థం జడ్పీ పాఠశాలలో షెడ్డు నిర్మాణం



**కె.గంగవరం, పెన్ పవర్,సెప్టెంబర్ 28:** రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం బట్లపాలిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.లక్షకు పైగా వ్యయంతో నిర్మించిన షెడ్డు ప్రారంభమైంది. సోమవారం ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ తదితరులతో కలిసి షెడ్డు ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ఎండ, వర్షాల సమయంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి షెడ్డు నిర్మించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యకుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## తుమ్మలపల్లి రమేష్ ను కలిసిన, చదలవాడ బాబి, జోకా శ్రీను.



**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్, 28:** జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ను, చదలవాడ బాబి, జోకా విజయ్ కుమార్ (శ్రీను) సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పిఠాపురంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో జాయిన్ అయినా సందర్భంగా చదలవాడ బాబి, జోకా విజయ్ కుమార్ ( శ్రీను ) జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి మండల జనసేన పార్టీ అధ్యక్షులు గంధం ప్రభాకర్, కిర్లంపూడి జనసేన పార్టీ నాయకులు చిక్కాల కల్కి భగవాన్,బోదుపు శ్రీను, దేవరపు గణేష్, బాబి మిత్రబృందం పాల్గొన్నారు

## కార్యకర్తలే టీడీపీకి వెన్నెముక



**కాకినాడ రూరల్, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** టీడీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, నియోజకవర్గ అబ్జర్వర్ గన్ని కృష్ణ, ఇన్‌చార్జి పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. వాకలపూడి మహాలక్ష్మినగర్‌లో సోమవారం పిల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఆత్మీయ అభినందన సభలో నాయకులు మాట్లాడారు. పార్టీకార్యక్రమాలను క్షేత్రస్థాయి నుంచి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీ కార్యకలాపాలను సమన్వయంతో నిర్వహించేందుకు ప్రతి కార్యకర్త మై టీడీపీ యాప్‌ను వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్, కరప మండలాలకు చెందిన నాయకులు,అనుబంధ విభాగాల ప్రతినిధులు,కమిటీ సభ్యులను సన్మానించారు.

కార్యక్రమంలోజిల్లా ప్రధాన కార్యదర్శి పెంకె శ్రీనివాస్ బాబా,వివిధ స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్స్,క్లస్టర్ లు, యూనిట్,బూత్ పార్టీ నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు,కార్యదర్శులు ,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశం విజయవంతం చేశారు.

# పరిశుభ్రతతోనే ఆరోగ్యకర జీవనం





**గండేపల్లి, పెన్ పవర్ , సెప్టెంబర్ 28** పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఎంపీడీవో కె. హరికృష్ణ సత్యారెడ్డి అన్నారు. డీ-వార్మింగ్ డే సందర్భంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి నరేష్ ఆధ్వర్యంలో మాత్రల పంపిణీ తో పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీవో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డీ-వార్మింగ్ మాత్రలను అందజేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ భోజనం చేసే ముందు, తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధులకు కారణమయ్యే క్రిములు, బ్యాక్టీరియా వ్యాప్తిని నియంత్రించవచ్చన్నారు. విద్యార్థి దశ నుంచే పరిశుభ్రతపై అవగాహన పెంచుకుని, ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు.
అనంతరం అవగాహన బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కార్యకర్తలకు ఘన సన్మానం

- పినిపేవారిపేటలో అంగన్వాడీ ఉత్సవాలు



**కొత్తపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** పినిపేవారిపేటలో సేవా సంకల్ప అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్వాడీ ఉత్సవాల కార్యక్రమానికి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాలూరి సత్యానందం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సేవా సంకల్ప అభియాన్ మండల కన్వీనర్ పాలూరి జయప్రకాష్ నారాయణ (జేపీ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త బి. భాస్కర రాజ్యం, ఆయా ఎస్కే గేషియా బేగంలను పాలూరి సత్యానందం, బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు.
సీడీపీవో గజలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, ఇతర ప్రయోజనాలను వివరించారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన అనంతరం చిన్నారులకు మరింత మెరుగైన ప్రయోజనాలు అందుతున్నాయని తెలిపారు.
పాలూరి సత్యానందం మాట్లాడుతూ గర్భిణులు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్, పౌష్టికాహారం తదితర ప్రయోజనాలు సక్రమంగా అందేలా అధికారులు, అంగన్వాడీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.
కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్కే పాతిమా బేగం, సేవా సంకల్ప అభియాన్ కో-కన్వీనర్ పి.దివ్య, ఆత్మ కమిటీ డైరెక్టర్ పాలాటి మాధవస్వామి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు రేలంగి ఆంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యుడు అన్యం సత్యనారాయణ, జనసేన నాయకులు చిక్కం శివాజీనాయుడు, శ్రీగ్రాకోలపు భీమేశ్వరరావు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు చోడపనీడి నాగబాబు, యువ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి ముకేశ్, టీడీపీ నాయకుడు రొట్టా రమణ తదితరులు పాల్గొన్నారు.

# లొల్లలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించిన డీఎల్‌డీఓ




**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 28:** లొల్ల గ్రామంలో నిర్వహిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని కొత్తపేట డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె. సురేష్‌కుమార్ సోమవారం సందర్శించి పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, ఇంటింటా చెత్త సేకరణ, తడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ, పొడి చెత్తను వేరు చేసి పునర్వినియోగం చేస్తున్న విధానాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె. సురేష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు 'చెత్త నుంచి సంపద' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు తడి, పొడి చెత్తను ఇంటి వద్దనే వేర్వేరుగా చేసి పారిశుధ్య సిబ్బందికి అందించడం ద్వారా గ్రామ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.వి.ఆర్.కె. రాజు, డివిజనల్ రిసోర్స్ పర్సన్ యు. చంద్రశేఖర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.వి.వి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# కథనానికి కదిలిన యంత్రాంగం!

- మల్లేపల్లి సచివాలయం--02 పరిసరాల్లో పిచ్చిమొక్కలు, చెత్త తొలగింపు
- "మూడు నాళ్ల ముచ్చట.. ప్రారంభమైన వెంటనే తాళం" కథనంపై అధికారుల స్పందన
- మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేసి అప్పగిస్తామంటున్న కాంట్రాక్టర్
- పరిసరాలు శుభ్రమయ్యాయి సరే.. ప్రజాసేవలు ప్రారంభమయ్యేది ఎప్పుడు?
- పూర్తిస్థాయి విధుల ప్రారంభంపై ఇంకా వీడని స్పష్టత

**గండేపల్లి, పెన్ పవర్: సెప్టెంబర్ ,28:** ప్రజాధనంతో నిర్మించిన మల్లేపల్లి గ్రామ సచివాలయం--02 నిరుపయోగంగా ఉండటం, భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోవడం, నిర్వహణ కొరవడటాన్ని వెలుగులోకి తెస్తూ ప్రచురించిన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. "మూడు నాళ్ల ముచ్చట.. ప్రారంభమైన వెంటనే తాళం" శీర్షికతో సమస్యను వెలుగులోకి తీసుకురావడంతో సోమవారం సచివాలయం పరిసరాల్లో శుభ్రత చర్యలు చేపట్టారు. భవనం చుట్టూ దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. దీంతో కొంతకాలంగా నిర్లక్ష్యానికి అద్దంపడుతున్న సచివాలయ పరిసరాల రూపురేఖలు మారాయి.

**కథనం తర్వాత కదలిక**

రూ.43.60 లక్షల ప్రజాధనంతో నిర్మించిన సచివాలయ భవనం ప్రారంభమైన కొద్దికాలానికే వినియోగానికి దూరమైందన్న అంశాన్ని కథనంలో ప్రధానంగా ప్రస్తావించారు. ప్రజలకు సేవలందించాల్సిన భవనానికి తాళం ఎందుకు పడింది? సిబ్బంది ఎక్కడి నుంచి విధులు నిర్వహిస్తున్నారు? నిర్వహణ బాధ్యత ఎవరిది? వంటి ప్రశ్నలను లేవనెత్తారు.
ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి కనీసం భవనం పరిసరాల శుభ్రతపై చర్యలు ప్రారంభించడం గమనార్హం.

**మౌలిక సదుపాయాలు పూర్తి చేసి అప్పగిస్తామన్న కాంట్రాక్టర్**

సచివాలయ భవనంలో ఇంకా అవసరమైన మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను పూర్తి చేసి భవనాన్ని అప్పగించే విషయంపై కాంట్రాక్టర్ నుంచి సమాచారం అందిందని పంచాయతీ కార్యదర్శి గంగాధర్ తెలిపారు. దీంతో భవనం పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాకపోవడానికి అసంపూర్తిగా ఉన్న మౌలిక సదుపాయాల పనులు కూడా ఒక కారణమా? అన్న ప్రశ్నకు కొంత స్పష్టత లభించినప్పటికీ, ఇంకా పలు అంశాలపై అధికారిక వివరణ రావాల్సి ఉంది.

**శుభ్రత సరే.. సేవలు ఎప్పుడు?**

సచివాలయం చుట్టూ పిచ్చిమొక్కలు తొలగించడం, చెత్తాచెదారాన్ని శుభ్రం చేయడం తక్షణ చర్యగా కనిపిస్తున్నప్పటికీ అసలు లక్ష్యం మాత్రం భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే.
సచివాలయంలో మిగిలిన పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయి? కాంట్రాక్టర్ భవనాన్ని అధికారులకు ఎప్పుడు అప్పగిస్తారు? సిబ్బంది పూర్తిస్థాయిలో ఎప్పటి నుంచి ఇక్కడ విధులు నిర్వహిస్తారు? ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలు ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తాయి? అనే ప్రశ్నలకు ఇంకా స్పష్టమైన సమాధానం రావాల్సి ఉంది.
ప్రజాధనంతో నిర్మించిన భవనం కేవలం శుభ్రంగా కనిపించడం మాత్రమే కాదు.. ఏ లక్ష్యంతో నిర్మించారో ఆ లక్ష్యానికి అనుగుణంగా ప్రజలకు సేవలందించినప్పుడే దాని ప్రయోజనం నెరవేరుతుంది.
అందువల్ల మిగిలిన మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన పూర్తి చేసి, సచివాలయం--02ను పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆదిత్యలో ప్రైవేట్ డిటెక్టివ్ శిక్షణ కార్యక్రమం




**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ ,28** ప్రైవేట్ డిటెక్టివ్, దర్యాప్తు రంగాల్లో విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఆదిత్య యూనివర్సిటీలో నిర్వహించిన "ప్రైవేట్ డిటెక్టివ్ అండ్ ఇన్వెస్టిగేషన్ స్కిల్స్" ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఆదిత్య లెర్నింగ్ అకాడమీ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్, స్కూల్ ఆఫ్ సైన్సెస్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేట్ ఇన్వెస్టిగేషన్‌కు పరిచయం, దర్యాప్తు ప్రణాళిక, సమాచార సేకరణ, ఇంటర్వ్యూయింగ్, స్టేట్‌మెంట్ రికార్డింగ్, బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్, సర్వైలెన్స్, పరిశీలన, సిట్యుయేషనల్ అవేర్‌నెస్ తదితర అంశాలపై శిక్షణ అందించినట్లు తెలిపారు. అలాగే కార్పొరేట్, ఇన్సూరెన్స్, మ్యాట్రిమోనియల్, మిస్సింగ్ పర్సన్ ఇన్వెస్టిగేషన్స్, రిపోర్ట్ రైటింగ్ వంటి విభాగాలపై కూడా అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. రిసోర్స్ పర్సన్‌లుగా ఫోరెన్సిక్ సైన్స్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆంచల్ సర్కార్, ఎం. షేక్‌షావలి వ్యవహరించారు. దర్యాప్తు నైపుణ్యాలు, ప్రైవేట్ ఇన్వెస్టిగేషన్ విధానాలు, సర్వైలెన్స్, కేస్ స్టడీస్‌పై వారు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు, పరిశోధకులు పాల్గొని ప్రైవేట్ డిటెక్టివ్, ఇన్వెస్టిగేషన్ రంగాలకు సంబంధించిన ప్రాయోగిక అవగాహన పొందారు. వైస్ ఛాన్సలర్ ఎం.బి. శ్రీనివాస్, ప్రొ వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎన్. రమాశ్రీ, డాక్టర్ ఎ. రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, ఆదిత్య లెర్నింగ్ అకాడమీ కోఆర్డినేటర్ డాక్టర్ ఐ. వీరాంజనేయులు మార్గదర్శకత్వంలో, ఫోరెన్సిక్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం. వెంకటలక్ష్మి సమన్వయంతో కార్యక్రమం నిర్వహించారు.

# తుఫాను దెబ్బకు మిరప, అరటి పంటలు విలవిల

33 శాతానికి పైగా నష్టం.. క్షేత్రస్థాయిలో ఉద్యానశాఖ పరిశీలన





**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** అర్నబ్ తుఫాను రైతన్నను దెబ్బతీసింది. భారీ వర్షాలు, పొలాల్లో నీటి ముంపుతో మిరప, అరటి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో ఉద్యానశాఖ అధికారులు సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేశారు. జగ్గంపేట మండలం కాట్రావులపల్లి, గండేపల్లి మండలం ఎర్రంపాలెం, ఎల్లమిల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.
జగ్గంపేట ఉద్యాన అధికారి ఎ. శ్రీ వల్లీ, పెద్దాపురం ఉద్యాన పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ సునీత రైతులతో మాట్లాడి పంటల పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో 33 శాతానికి పైగా పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు.
పొలాల్లో 48 గంటలకు మించి నీరు నిలిచిపోవడంతో మిరపలో వాడిపోయే తెగులు (విల్ట్) సోకే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. నీటి ముంపు నుంచి పంటలను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. దెబ్బతిన్న మిరపకు ప్రత్యామ్నాయంగా తక్కువ కాలవ్యవధిలో చేతికొచ్చే మొక్కజొన్న, నువ్వులు, మినుములు, బెండ వంటి పంటలను సాగు చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారులు సూచించారు

# ఆదిత్య ఇంజనీరింగ్ యూనివర్సిటీలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్ బి ఎస్ కే అధికారి డాక్టర్" అరుణ కుమారి





**గండేపల్లి పెన్ పవర్,(సూరంపాలెం) సెప్టెంబర్, 28** గండేపల్లి మండలం సూరంపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆదిత్య ఇంజనీరింగ్ యూనివర్సిటీలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌బీఎస్‌కే కార్యక్రమ అధికారి డాక్టర్ అరుణ హాజరై విద్యార్థులకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. అధిక బరువు సమస్య, చేతుల పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిల ప్రాధాన్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవరుచుకోవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని వివరించారు.
కార్యక్రమంలో డాక్టర్ హరిత్‌తో పాటు వైద్య సిబ్బంది, విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

# ఈ రహదారి... ప్రమాదమే సుమా!





**కల్వర్టు కుంగి భారీ గుంత.. నెలలు గడుస్తున్నా పట్టని అధికారుల దృష్టి**

**హెచ్చరిక బోర్డుతో సరిపెట్టడం.. ఇరుకుదారిలో ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలు**

**చీకటి పడితే మరింత ప్రమాదకరం.. పరిష్కారం ఎప్పుడంటున్న స్థానికులు**

**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్, 28** రహదారిపై భారీ గుంత.. దాని పక్కనే ఇరుకుదారి.. ఎదురుగా వాహనం వస్తే తప్పించుకునే పరిస్థితి లేదు. చీకటి పడితే ప్రమాదం మరింత పొంచి ఉంది. గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో ప్రధాన రహదారిపై కల్వర్టు కుంగిపోవడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గ్రామంలోని జాతీయ రహదారి నుంచి పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, ఆలయానికి వెళ్లేందుకు ఈ మార్గమే ప్రధానమైనది. ఇటీవల భారీ వాహనం రాకతో కల్వర్టుతో పాటు సీసీ రోడ్డు కొంతమేర కుంగిపోయి భారీ గుంత ఏర్పడింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెద్ద వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోగా, ఆటోలు, ద్విచక్ర వాహనాలు మాత్రమే పక్కనున్న ఇరుకైన మార్గం గుండా వెళ్లాల్సి వస్తోంది.

**హెచ్చరిక బోర్డుతోనే సరి!**

కల్వర్టు దెబ్బతిని నెలలు గడుస్తున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని స్థానికులు వాపోతున్నారు. ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రివేళ సరైన వెలుతురు లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు గుంతను గుర్తించలేక అదుపుతప్పే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**చిన్నారులను పంపాలంటే భయం**

అంగన్వాడీ కేంద్రానికి చిన్నారులను పంపాలంటే తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని స్థానికులు చెబుతున్నారు. పాఠశాలలు, ఆలయానికి వెళ్లే ప్రజలు కూడా ఈ మార్గం దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఎదురుగా వాహనం వస్తే ఇరుకైన దారిలో తప్పుకునే అవకాశం లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టును పునర్నిర్మించి, రహదారిని పూర్తిస్థాయిలో మరమ్మతు చేయాలని తాళ్లూరు గ్రామస్థులు కోరుతున్నారు. హెచ్చరిక బోర్డులు కాదు.. శాశ్వత పరిష్కారం కావాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## ఘనంగా 9వ జాతీయ పోషణ మాసోత్సవం.





**మన అంగన్వాడీ -- మన బాధ్యత.**

**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** స్థానిక మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాల్లో 9వ జాతీయ పోషణ మాసోత్సవాన్ని ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా దేశవ్యాప్తంగా జాతీయ పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సిడిపిఓ పద్మావతి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో అంగన్వాడీలు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను ఘనంగా స్వాగతించారు. ఎమ్మెల్యే తో పాటు రాష్ట్ర మహిళా కార్యదర్శి సుంకర పావని,బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, జనసేన నేత మేడిశెట్టి బాబి లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.తొలుత అంగనవాడిల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తృణధాన్యాలు పోషక ఆహార పదార్థాల ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా సిడిపిఓ పద్మావతి మాట్లాడుతూ మన అంగన్వాడీ -- మన బాధ్యత పేరిట పోషణ మాసోత్సవాన్ని ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా నెలరోజులపాటు నిర్వహిస్తున్నారని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాలను పోషణ, ఆరోగ్యం, బాలల సంరక్షణ, చిన్నారుల ప్రాథమిక విద్యకు కేంద్ర బిందువులుగా మరింత బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంమని అన్నారు.ఈ సందర్భంగా చిన్నారుల తమ ప్రతిభను ప్రముఖుల ముందు ప్రదర్శించారు, అనంతరం బాలింతలకు ఎమ్మెల్యే సత్యప్రభ చేతుల మీదుగా సీమంతం జరిపించారు, బాల్య దశ నుండి చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న అంగన్వాడి కార్యకర్తలను ప్రముఖుల చేతుల మీదుగా సాలువ పూలమాల, మెమెంటో తో సత్కరించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ ఉత్సవం పేరుతో పలు అవగాహన కార్యక్రమాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు సమతుల ఆహారం, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం, పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ, బాలల ఎదుగుదల వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారనారు.స్థానికంగా లభించే తృణధాన్యాలు, పప్పులు, కూరగాయలు తదితర పోషక పదార్థాలతో ఆరోగ్యకరమైన వంటకాల తయారీపై ప్రదర్శనలు, పోషణ మేళాలు, తల్లిదండ్రుల భాగస్వామ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారనీ అంగన్వాడీ కేంద్రాల్లో అందించే ఆహారం, మెనూ వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. చిన్నారి దశలోనే కార్పొరేట్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన రమణయ్యపేట అంగన్వాడి సెంటర్ చిన్నారులు మసస్ మీనాక్షి లను ఆశీర్వదించారు,చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న అంగన్వాడి సిబ్బందికి అభినందనలు తెలిపారు.బిజెపి జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరుణంలో, ప్రధాని జన్మదిన సందర్భంగా నెల రోజులపాటు ఈ అంగన్వాడి ఉత్సవం చేపట్టటం జరుగుతుందని అన్నారు.పోషణ కార్యక్రమాల విషయంలోనూ ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా "సుపోషిత భారత్" నిర్మాణానికి కృషి చేయాలనే లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు.మన అంగన్వాడీ -- మన బాధ్యత అనే సందేశంతో ప్రతి కుటుంబం, తల్లిదండ్రులు,ప్రజలు అంగన్వాడీ కేంద్రాల కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సాయి అపర్ణ,ఏలేశ్వరం మండల, పట్టణ టిడిపిపార్టీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు,మూది నారాయణస్వామి, లింగంపర్తి సొసైటీ చైర్మన్ పెంటకోట మోహన్, అలమడ చలమయ్య ,బొదిరెడ్డి గోపి, నీరుకొండ సత్యనారాయణ, పసల సూరిబాబు,బసా మహాలక్ష్మి ప్రసాద్, మైరాల కనకారావు, బుద్ధ సూర్య ప్రకాశ్,సింగిలి దేవి సత్తిరాజు, మహిళా మోర్చా కార్యదర్శి కార్యదర్శి శైలజ, గట్టెం వెంకటరమణ, సత్యంశెట్టి సీతబాబు, పలివెల వెంకటేష్, పలివెల శ్రీనివాస్, అవసరాల సూర్య ప్రకాష్ రావు, కొప్పుల బాబ్జి, సుంకర సత్యనారాయణ, మగాపు వీరబాబు, ప్రత్తిపాడు, జగ్గంపేట సిడిపిఓలు టిడిఆర్ పద్మావతి,పూర్ణిమ, సూపర్వైజలు సూర్య కుమారి, ఎన్ వరలక్ష్మి, కే సునీత, అల్లాడి లక్ష్మీ, హేమ, సత్య, అంగన్వాడి కార్యకర్తలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణకు విద్యార్థులకు మాత్రల పంపిణీ



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 28**:మండలంలో నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆత్రేయపురం మహాత్మా గాంధీ జూనియర్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఉపయోగించే ఆల్బెండజోల్ మాత్రలను కొత్తపేట డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కె. సురేష్ కుమార్ అందించి, విద్యార్థులతో మాత్రలు వేయించారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ నులిపురుగుల నివారణలో ఆల్బెండజోల్ మాత్రలు కీలకమని, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. భోజనం ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజు, సూపర్వైజర్ నిర్మల కుమారి, ఎం.ఎల్.హెచ్.పీ మనోజ్ కుమారి, మండల విద్యాశాఖాధికారి పి.వి. ప్రసాదరావు, డివిజనల్ రిసోర్స్ పర్సన్ యు. చంద్రశేఖర్, ఏఎన్ఎం దివ్యజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య కళాశాలలో ఘనంగా గుర్రం జాషువా,భగత్ సింగ్ జయంతి వేడుకలు




**కాకినాడ, సెప్టెంబర్ 28 పెన్ పవర్:** లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, తెలుగు విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో విశ్వనరుడు, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా, దేశభక్తికి నిలువెత్తు రూపమైన భగత్ సింగ్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఎన్నో కష్టాలు, కన్నీళ్లను భరించి తన సాహిత్యంతో ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు గుర్రం జాషువా అని, భారత స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన మహా విప్లవకారుడు భగత్ సింగ్ అని కొనియాడారు. తెలుగు విభాగాధిపతి టి. తేజేశ్వరరావు మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాల్లో చైతన్యం నింపిన ఆశాజ్యోతి గుర్రం జాషువా అని, విశ్వనరుడిగా ప్రసిద్ధి పొందిన ఆయన సాహిత్యం సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. జాషువా పేరు వినగానే గబ్బిలం, కొత్తలోకం, నా కథ, స్వప్నకథ, బాపూజీ, నేతాజీ వంటి రచనలు గుర్తుకొస్తాయని తెలిపారు. ప్రస్తుతం డిగ్రీ విద్యార్థులకు కొత్తలోకం పాఠ్యాంశంగా ఉందని, విద్యార్థులు జాషువా రచనలను చదివి ఆయన సాహిత్యంలోని సామాజిక సందేశాన్ని అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన తెలుగు విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ ఎన్. సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి అశ్విని, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో విఆర్ఏలు ర్యాలీ, మానవహారం



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** తమ న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ విఆర్ఏలు చేస్తున్న ధర్నా సోమవారం 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జగ్గంపేట హైస్కూల్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వీఆర్ఏలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ముందుగా జగ్గంపేట తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అక్కడి నుంచి ర్యాలీ చేపట్టారు. జగ్గంపేట సెంటర్లో నిరసన వ్యక్తం చేస్తూ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల అధ్యక్షుడు ఇస్సాకు, సెక్రటరీ మౌళి, వీఆర్ఏలు పాల్గొన్నారు.

## ఇర్రిపాకను ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా మార్చేందుకు మాస్టర్ ప్లాన్



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** మండలంలో ఇర్రిపాక శివ కేశవుల క్షేత్రంలో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులతో నిర్మాణం జరుగుతున్న అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణ ఆలయం, అయోధ్య రామ మందిరాన్ని పోలిన బాల రాముడి ఆలయం పనులను వేగవంతం చేసేందుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతస్థాయి బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో కలిసి దేవాదాయ శాఖ అధికారులు డిప్యూటీ కమిషనర్ డి.ఎల్.వి రమేష్ బాబు , సూపరింటెండింగ్ ఇంజనీర్ తోట దుర్గేష్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ – స్థపతి ఎన్. ఉదయ్ భాస్కర్ కుమార్, డిప్యూటీ స్థపతి పి. సతీష్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎల్.ఆర్.డి బల్లా శివ కుమార్, చల్లా ఉదయ బాబు నాయుడు, గండేపల్లి గ్రూప్ టెంపుల్స్, తంటికొండ దేవస్థానం ఈవో, తిరుమల నుంచి శిల్పులు వచ్చి ఆలయాల నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి, నిర్మాణ ప్రణాళికపై కూలంకుషంగా చర్చించారు. పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం శివ కేశవుల ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల మణి అధ్యక్షతన బోర్డు సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ రిజిస్ట్రేషన్, ప్రతి నెల శ్రవణా నక్షత్రం సందర్భంగా భక్తుల చేతుల మీదుగా వెంకటేశ్వర స్వామికి అభిషేకం నిర్వహణ, నిర్మాణంలో ఉన్న ఆలయాలతో పాటు తలపెట్టిన మహా యజ్ఞం, కోటిలింగాలతో కోటిలింగేశ్వరుడి నిర్మాణంలో భక్తులందరూ భాగస్వాములు అయ్యే అవకాశం కల్పించడంపై తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్తకొండ బాబు, కుంచెతాతాజీ, బదిరెడ్డి అచ్చన్న దొర, సత్తి సదాశివరెడ్డి, మలిరెడ్డి వెంకట శ్రీధర్, వై గోవిందు నాయుడు, బోదిరెడ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు తగ్గుముఖం.. పంటలపై ప్రత్యేక శ్రద్ధ



**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ ,28**:ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారిణి జే. లక్ష్మి సోమవారం వరి, మినుము పంటలను పరిశీలించారు. పంటల పరిస్థితిని పరిశీలించిన ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం రెండు రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టినందున పంటల్లో తెగుళ్లు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

మినుము, వరి పంటల్లో తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 1--2 గ్రాముల కార్బెండజిమ్ లేదా మాంకోజెబ్, లేదా లీటరు నీటికి ప్రొపికోనజోల్‌ను సిఫార్సు మేరకు పిచికారీ చేయాలని తెలిపారు.అంకుర దశలో ఉన్న వరి పంటకు ఎకరానికి 35 కిలోల యూరియా, 13 కిలోల ఎంఓపీ ఎరువులను నేలలోని తేమ శాతాన్ని పరిశీలించిన అనంతరం వేయాలని రైతులకు సూచించారు. పంట పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటించాలని ఆమె కోరారు

## ఆత్రేయపురం మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా కె. సురేష్ కుమార్

**అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమన్వయానికి ప్రాధాన్యం**



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 28:**మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఆత్రేయపురం మండల పరిషత్‌కు ప్రత్యేక అధికారిగా డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె. సురేష్ కుమార్‌ను జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ నియమించారు. ఈ మేరకు సోమవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజు, తహశీల్దార్ ఆర్.డి. రామచంద్రమూర్తి, పరిపాలనాధికారి వి. రామస్వరూప్‌తో పాటు మండల పరిషత్, గ్రామ సచివాలయ సిబ్బంది సురేష్ కుమార్‌ను శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు.అనంతరం మండల పరిషత్ పరిపాలన, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రజలకు సకాలంలో చేరేలా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎటువంటి జాప్యం లేకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.

ప్రత్యేక అధికారి కె. సురేష్ కుమార్‌కు మండల అధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

# పేద కుటుంబాలకు అండగా పోలిశెట్టి చంద్రశేఖర్





- డొక్కా సీతమ్మ ఆసరా పథకం ద్వారా 14 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ
- పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు
- పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు మెమోరియల్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆపన్నులకు భరోసా

**రామచంద్రపురం, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలవడమే లక్ష్యంగా జనసేన పార్టీ రామచంద్రపురం నియోజకవర్గ ఇంచార్జి, పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు మెమోరియల్ ఛారిటబుల్ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ పోలిశెట్టి చంద్రశేఖర్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ ఆసరా పథకం ద్వారా సోమవారం నియోజకవర్గంలోని మండలాలు, పట్టణ పరిధిలో మరణించిన వారి కుటుంబాలను పరామర్శించి, 14 కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు.పోలిశెట్టి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు ట్రస్ట్ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. కష్టకాలంలో ఉన్న కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ, వారికి అండగా నిలిచారు. కె.గంగవరం మండలంలోని పానింగపల్లికి చెందిన జుత్తుగ జ్యోతి, పామర్రుకు చెందిన జంగం బాబూరావు, పాతకోటకు చెందిన మల్లిడి చంద్రరావు, రావిదొడ్డిపేటకు చెందిన కురాటి లక్ష్మమ్మ కుటుంబాలను పరామర్శించారు.కాజులూరు మండలంలోని పల్లిపాలెంకు చెందిన కటారి అప్పారావు, కుయ్యేరుకు చెందిన గిడ్ల శ్రీరాములు, కాజులూరుకు చెందిన తలారి నాగేశ్వరరావు, శలపాకకు చెందిన పోలినాటి లక్ష్మణరావు కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. రామచంద్రపురం మండలంలోని తోటపేటకు చెందిన గురజా గంగరాజు, వెలంపాలెంకు చెందిన యార్లగడ్డ సత్యనారాయణ, ఒదూరుకు చెందిన బచ్చల సావిత్రి, అదివరపుపేటకు చెందిన గోడి బాలయోగి కుటుంబాలను పరామర్శించి సహాయాన్ని అందించారు. రామచంద్రపురం పట్టణంలోని స్టీల్ వెల్ పేటకు చెందిన దార్ల చంద్రమ్మ, కందిపట్ల జయ కుటుంబాలకు కూడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్, నియోజకవర్గ ట్రస్ట్ కోఆర్డినేటర్ గుబ్బల శ్రీనివాస్, కె.గంగవరం మండల జనసేన అధ్యక్షుడు చిర్రా రాజకుమార్, పోలిశెట్టి పెదబాబు పాల్గొని బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు. జనసేన నాయకులు, గ్రామ పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు.పోలిశెట్టి చంద్రశేఖర్ నాయకత్వంలో ట్రస్ట్ ద్వారా అమలవుతున్న డొక్కా సీతమ్మ ఆసరా పథకం నిరుపేద కుటుంబాలకు ఆపన్నహస్తంగా నిలుస్తోందని, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో ట్రస్ట్ ముందుకు సాగుతోందని పార్టీ శ్రేణులు తెలిపారు.

## మీడియేషన్ ద్వారా కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలి



**రామచంద్రపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 28:** కేసుల సత్వర పరిష్కారానికి మీడియేషన్ (మధ్యవర్తిత్వం) ద్వారా రాజీ చేసుకునేలా న్యాయవాదులు సహకరించాలని మండల న్యాయ సేవల కమిటీ చైర్మన్,13వ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు జడ్జి బి.హెచ్.వి. లక్ష్మీకుమారి కోరారు.సోమవారం అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మొత్తం 161 కేసులను మధ్యవర్తిత్వానికి పంపించామని తెలిపారు.సంబంధిత న్యాయవాదులు కక్షిదారులతో మాట్లాడి కేసుల పరిష్కారానికి పూర్తి సహకారం అందించాలని సూచించారు. కార్యక్ర మంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటిపల్లి లోవరాజు,కార్యదర్శి నీలం మధుసూదనరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## శ్రీ యువ గణపతి 60వ వార్షికోత్సవం,

- 60 కేజీల లడ్డు, రూ.1.30 లక్షలకు వేలం..



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 28:**శ్రీ యువ గణపతి స్వామి వారి 60 వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గణపతి నవరాత్రులను పురస్కరించుకొని గత 14 రోజులుగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమాలు, స్వామివారి అలంకరణలు, విద్యుత్ దీపాల వెలుగులు విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వామివారి 60వ వార్షికోత్సవ మునకు ప్రధాన ఆకర్షణగా చవితి ఉత్సవాల సందర్భంగా ప్రతి ఏటా బొర్రా వీర్రాజు సోదరులు అందించే ప్రసాదం లడ్డు 60 సంవత్సరాల వార్షికోత్సవం సందర్భంగా 60 కేజీల లడ్డు విశిష్టతను సంతరించుకుంది. చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణం లో ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం స్వామివారి ప్రసాదం లడ్డూను వేలం నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పోటా పోటీగా పాల్గొన్నారు. చివరకు యనమదల మురళి - సునీత దంపతులు రూ.1.30 లక్షలకు వేలంపాటలో స్వామివారి లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం లడ్డూను ఆలయకమిటి సభ్యులు లడ్డూ ను అంద చేసారు.

## అంగన్వాడీ, ఆశా కార్యకర్తలకు ఘన సన్మానం





**కాజులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 28**: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా కాజులూరు మండలం దుగ్గుదుర్రు అంగన్వాడీ కేంద్రంలో సోమవారం అంగన్వాడీ ఉత్సవాన్ని నిర్వహించారు. రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా సేవా ఫస్ట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ కో-కన్వీనర్ దూడల శంకరనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ పరిధిలోని ఆరు అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు,ఆయాలు,ఆశా కార్యకర్తలను వారి సేవలను గుర్తించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు,చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్య సేవలు అందించడంలో అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న కృషిని అభినందించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార పదార్థాలు, వాటి పోషక విలువలను వివరించే స్టాళ్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి కోపనాతి దత్తాత్రేయ, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జి సత్తిబాబు,బూత్ అధ్యక్షుడు సింగన్న శ్రీనివాస్,తాళ్లరేవు ఐసీడీఎస్ సీడీపీవో వై. శ్రీదేవి, కోలంక సెక్టార్ విస్తరణ అధికారి సీహెచ్. నాగలక్ష్మి,అంగన్వాడీ కార్యకర్తలు సలాది లక్ష్మి,సుజాత, పైడికొండల పుణ్యవతి,సచివాలయ మహిళా పోలీస్ ఈ.వెంకటకుమారి తదితరులు పాల్గొన్నారు.

## కిర్లంపూడిలో ఘనంగా జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం.



**కిర్లంపూడి,పెన్ పవర్, సెప్టెంబర్, 28:**కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి శ్రీ కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం నిర్వహించారు.ఇటీవల సంభవించిన తుఫాను ప్రభావం వలన ఈ నెల 25వ తేదీన జరగవలసిన జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం వాయిదా పడి, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా. రాంబాబు నాయక్ ఆధ్వర్యంలో సోమవారం అధికారికంగా నిర్వహించారు.

?ఈ కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్ గౌతు వెంకయ్యానాయుడు (చిన్న )విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి రాంబాబు నాయక్ మాట్లాడుతూ పిల్లల కడుపులో నులిపురుగులు చేరడం వల్ల రక్తహీనత, పోషకాహార లోపం ఏర్పడి శారీరక, మానసిక ఎదుగుదల మందగిస్తుందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం 1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ (400 మి.గ్రా.) మాత్రలు తప్పనిసరిగా వేయించాలన్నారు.పిల్లలు తప్పనిసరిగా ఈ మాత్రను నమిలి మింగాలన్నారు.వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు.నేడు ఈ మాత్రలు వేసుకోలేకపోయిన విద్యార్థుల కోసం అక్టోబర్ 5న నిర్వహించే మాప్-అప్ డే రోజున మాత్రలు పంపిణీ చేయబడతాయని వివరించారు.

ఈ కార్యక్రమంలో హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ గౌతు వెంకయ్యానాయుడు (చిన్న)తోపాటు తూము శ్రీరామ్,పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు,పి రమణికుమారి,పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బీసీలకు రాజకీయ ప్రాధాన్యమే లక్ష్యం.

-స్థానిక ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు చారిత్రక నిర్ణయం.

-రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి బద్రి

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,సెప్టెంబర్, 28**:స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేలా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత పెంచే చారిత్రక అడుగని రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి వీరభద్రరావు (బద్రి) అన్నారు. సోమవారం ప్రత్తిపాడులో పెరిక సంఘ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని బద్రి పేర్కొన్నారు. చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించడం బీసీలకు మరింత ప్రాతినిధ్యం కల్పించే దిశగా కీలక నిర్ణయమన్నారు. బీసీలకు రాజకీయంగా గుర్తింపు తీసుకురావడంలో తెలుగుదేశం పార్టీ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. బీసీలను సంఘటితం చేసి రాజకీయ, సామాజికంగా ముందుకు తీసుకెళ్లేందుకు టీడీపీ ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపట్టాయని తెలిపారు.టీడీపీతో బీసీలకు నాలుగు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీసీల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ వివిధ పథకాలు, కార్యక్రమాల ద్వారా రూ.32,534 కోట్లు ఖర్చు చేసినట్లు బద్రి తెలిపారు. రాష్ట్ర జనాభాలో బీసీల వాటా 50.42 శాతంగా ఉందని, సగానికి పైగా ఉన్న బీసీలకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు దక్కాల్సిన అవసరం ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలపై అణచివేత జరిగిందని బద్రి విమర్శించారు. బీసీ నాయకులపై దాడులు, హింసకు పాల్పడ్డారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం బీసీలకు అండగా నిలుస్తూ వారి రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. రానున్న రోజుల్లో బీసీలు అన్ని రంగాల్లో మరింత ఉన్నత స్థానాలకు ఎదిగేలా టీడీపీ అధిష్ఠానం దృష్టి సారించిందని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మదినే వెంకన్నదొర, జిల్లా సంఘ నాయకులు వనపర్తి సతీష్, చిలకమర్తి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.




## అర్జీలు గడువు దాటకుండా పరిష్కరించాలి







కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, సెప్టెంబర్ 28 పెన్ పవర్:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్వో డా. తిప్పే నాయక్ తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా గతంలో అందిన అర్జీల పరిష్కారంపై సమీక్షించిన కలెక్టర్, శాఖల వారీగా అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని సూచించారు. రెవెన్యూ, ఆర్ఓఆర్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే నిరసన చేపడతాం




పాటంశెట్టి సూర్యచంద్ర

**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** పట్టణంలోని ప్రధాన కూడలిలో మురుగునీరు రోడ్డుపై నిలిచిపోయి దుర్గంధభరితంగా మారినా సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం దారుణమని జగ్గంపేట నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర మండిపడ్డారు. జగ్గంపేటకు నిత్యం వేలాది మంది ప్రజలు వచ్చిపోయే మెయిన్ సెంటర్‌లోనే మురుగునీరు రోడ్డుపై నిలిచిపోయి, దుర్వాసన వెదజల్లుతున్న పరిస్థితి నెలకొంటే అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రజలు, వ్యాపారులు నిత్యం ఇబ్బందులు పడుతుంటే అధికారులు, పాలకులకు ఈ సమస్య కనిపించడం లేదా? ప్రజల ఆరోగ్యం పట్ల ఇంత నిర్లక్ష్యమా? అని సూర్యచంద్ర నిలదీశారు. వీడియోలో కనిపిస్తున్న పరిస్థితిని చూస్తే జగ్గంపేట ప్రధాన కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందని అన్నారు. మురుగునీరు నిలిచిపోవడానికి కారణమైన డ్రైనేజీ సమస్యను గుర్తించి నీటిని తొలగించడమే కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. జగ్గంపేట మెయిన్ సెంటర్‌లో ప్రజలు ఇంత ఇబ్బంది పడుతుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నాలుగు రోజుల్లో ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించాలి. నాలుగు రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే ఇదే ప్రదేశంలో కూర్చుని ప్రజల తరఫున నిరసన చేపడతానని పాటంశెట్టి సూర్యచంద్ర స్పష్టం చేశారు.

# ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పర్యటన







**నిల్వ నీటిని తొలగించాలని ఆదేశం**

**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 28** : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ముంపునకు గురై రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాకినాడ నగరంలోని 43, 48, 49వ వార్డులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మధురానగర్, అశోక్‌నగర్‌లో రోడ్లపై నిలిచిన నీటిని తక్షణమే తొలగించి రాకపోకలను పునరుద్ధరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ సత్యనారాయణను ఆదేశించారు. 48వ వార్డు జనచైతన్య నగర్ వద్ద గాడేరు కాలువ నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించాలని సూచించారు. 43వ వార్డు ట్రెజరీ కాలనీని కూడా పరిశీలించారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న బాధితులకు అందుతున్న భోజనం, వసతి సౌకర్యాలపై ఆరా తీసి, స్వయంగా భోజనం వడ్డించారు. స్వల్పంగా ముంపునకు గురైన ప్రాంతాల్లోని నివాసితులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాల వల్ల వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నీటి ప్రవాహానికి అడ్డంకిగా కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీ చేయాలని సూచించారు. పర్యటనలో కమిషనర్ సత్యనారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో ఘనంగా గుర్రం జాషువా జయంతి




**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ డి.సత్యలత మహాకవి గుర్రం జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారావు, అధ్యాపకులు, విద్యార్థులు మహాకవి గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారావు మాట్లాడుతూ, మహాకవి గుర్రం జాషువా తెలుగు సాహిత్యంలో తనదైన ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న గొప్ప కవి అని కొనియాడారు. తన రచనల ద్వారా సమాజంలోని అసమానతలు, అంటరానితనం, కుల వివక్ష వంటి సామాజిక రుగ్మతలను ప్రశ్నించి, సమానత్వం, మానవత్వం, సామాజిక న్యాయం కోసం తన కలాన్ని ఆయుధంగా మలిచారని పేర్కొన్నారు. ఆయన రచనలు నేటి సమాజానికి కూడా ఎంతో స్ఫూర్తిదాయకమని, విద్యార్థులు జాషువా సాహిత్యాన్ని అధ్యయనం చేసి ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.

# ముంపు బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీకి ముమ్మర ఏర్పాట్లు





**కాకినాడ/గొల్లప్రోలు, సెప్టెంబర్ 28, పెన్ పవర్:** భారీ వర్షాలతో ముంపునకు గురై పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న బాధితులకు నిత్యావసర సరుకులు త్వరితగతిన పంపిణీ చేసేందుకు ప్యాకింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. సోమవారం గొల్లప్రోలు మండలంలోని పౌర సరఫరాల నిల్వ కేంద్రం (ఎంఎల్ఎస్ పాయింట్)లో జరుగుతున్న సరుకుల ప్యాకింగ్‌ను ఆయన పరిశీలించారు. సరుకుల నాణ్యత, బరువు, ప్యాకింగ్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యల్లో భాగంగా ప్రతి బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్యాకింగ్‌లో ఎలాంటి అలసత్వం లేకుండా పనులను వేగవంతం చేసి, వంద శాతం పూర్తి చేసి లబ్ధిదారులకు సకాలంలో సరుకులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

## జగపతినగరం నర్సరావు పేట సిద్ధివినాయక ఆలయం భారీ అన్నదానం.



**-స్వామివారిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న తుమ్మలపల్లి రమేష్.**

**కిర్లంపూడి, పెన్ పవర్,సెప్టెంబర్ 28:** కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామం నర్సారావుపేటలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సిద్ధి వినాయక మండపాన్ని జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా సిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాడి చినబుజ్జి, గంధం ప్రభాకర్, చిక్కాల కల్కిభగవాన్, ఆళ్ల నానాజీ, దాడి గోవిందు, బాబి, సిద్ధి వినాయక యూత్ సభ్యులు, జగపతినగరం గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడలో ఈ నెల 30న వికాస ఆధ్వర్యంలో ప్రత్యేక జాబ్ మేళా

**కాకినాడ, సెప్టెంబర్ 28 పెన్ పవర్:** నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో వికాస ఆధ్వర్యంలో ఈ నెల 30న కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం ఐ2 సాఫ్ట్ టెక్నాలజీస్, ఈజెడ్ పై వెంచర్స్ కంపెనీల్లో టెస్టింగ్ ఇంజనీర్, క్యూఎ ఇంజనీర్, ఏపీఐ ఆటోమేషన్ టెస్ట్ ఇంజనీర్, మాన్యువల్ టెస్టింగ్, పైథాన్ తదితర పోస్టులకు బీటెక్, బీఈ, బీసీఏ, ఎంసీఏ 2024--2026 మధ్య ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. టాటా ఎలక్ట్రానిక్స్‌లో మొబైల్ ఆపరేటర్, హీరో కంపెనీలో ట్రైనీ పోస్టులకు ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 నుంచి 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని, ఉద్యోగాలను బట్టి నెలకు రూ.13,000 నుంచి రూ.37,500 వరకు జీతంతో పాటు షిఫ్ట్ అలవెన్సు, ఓవర్‌టైమ్, భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు కల్పిస్తారని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30న ఉదయం 9 గంటలకు విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో వికాస కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7799376222, 7799376111 నంబర్లను లేదా ఞఞఞ.జఆఝఞఝఞఞశీఎం.ఞశీఏ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.



**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్, 28** కాకినాడ మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ వి. కృష్ణారావు గండేపల్లి మండల పరిషత్ స్పెషల్ ఆఫీసర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్‌కు సంబంధించిన పరిపాలనా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధికారి హరికృష్ణ సత్యారెడ్డి తో పాటు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

## జగన్నాథగిరిలో రూ.10 లక్షలతో డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన





**కాజులూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 28** : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రాధాన్యతని కూటమి సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ అన్నారు. కాజులూరు మండలం జగన్నాథగిరి బీసీ కాలనీలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైన్ నిర్మాణ పనులకు సోమవారం వారు ఎంపీడీవో జె. రాంబాబు, కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రామచంద్రపురం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక దృష్టి సారించి, ఇప్పటికే సుమారు రూ.270 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సహకారంతో మంత్రి సుభాష్ నియోజకవర్గానికి అభివృద్ధి నిధులు సమకూరుస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జె. రాంబాబు, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ జాన్ పాల్, సొసైటీ చైర్మన్ కొండమూరి సత్యనారాయణ, కొప్పన లక్ష్మి,నల్లా శ్రీ వసంత హరిణి,దేగల సతీష్,డీసీలు పేపకాయల బాబ్జీ, కృష్ణ చైతన్య,వనుం వీరబ్రహ్మం, యాళ్ల శేఖర్,యాళ్ళ సత్తిబాబు,కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శంఖవరం బైపాస్‌పై రాజకీయ వేడి.. వైసీపీకి టీడీపీ నేతల కౌంటర్

- వైసీపీ హయాంలో రోడ్డు సమస్యను ఎందుకు పరిష్కరించ లేదు...
- ఎమ్మెల్యే సత్యప్రభ నిరంతర కృషితోనే అభివృద్ధి పనులు....



**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 28 :-** శంఖవరం బైపాస్ రోడ్డు సమస్యపై వైఎస్సార్‌సీపీ నాయకులు రాజకీయాలు చేయడం సరికాదని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్, సీనియర్ టీడీపీ నాయకుడు బద్ది రామారావు అన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే ఈ రోడ్డు సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోయారని ప్రశ్నించారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు రహదారి సమస్యపై రాజకీయాలు చేయడం తగదని పేర్కొన్నారు.

**రూ.98 లక్షలతో రహదారి మరమ్మతులు**

శంఖవరం నుంచి కత్తిపూడి వరకు రహదారి మరమ్మతుల కోసం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో రూ.98 లక్షలు ఖర్చు చేసినట్లు వెన్నా శివ తెలిపారు. ఎమ్మెల్యే కృషితోనే డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డీఎంఎఫ్) నిధుల నుంచి రహదారి అభివృద్ధి పనులకు రూ.1.50 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.

బైపాస్ రోడ్డు కోసం సత్యప్రభ కృషి శంఖవరం గ్రామంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కృషి చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, అన్నవరం దేవస్థానం పాలక మండలి సభ్యుడు పర్వత సురేష్ తెలిపారు.

ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

శంఖవరం గ్రామంలో బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం రిలే నిరాహార దీక్షలు చేస్తున్న వారు భూసేకరణకు సహకరించాలని కోరారు.

దశాబ్దాల రహదారి సమస్యలకు పరిష్కారం

ప్రత్తిపాడు నియోజకవర్గంలో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని రహదారులను అభివృద్ధి చేయిస్తున్న ఘనత ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభదేనని సీనియర్ టీడీపీ నాయకుడు బద్ది రామారావు అన్నారు. ప్రజలకు అవసరమైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.

# ప్రజా ఫిర్యాదులపై బాధ్యతగా స్పందించి సకాలంలో పరిష్కరించాలి: కలెక్టర్






**కాకినాడ, సెప్టెంబర్ 28 పెన్ పవర్:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీలపై అధికారులు బాధ్యతాయుతంగా స్పందించి, సకాలంలో నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్వో డాక్టర్ తిప్పే నాయక్ తదితరులు ప్రజల నుంచి 401 అర్జీలు స్వీకరించారు. అదేవిధంగా రెవెన్యూ క్లినిక్‌లో 67 అర్జీలు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఆయా అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో లక్ష్మణరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ. శ్రీనివాసరావు, జిల్లా స్వర్ణ గ్రామ, వార్డు అధికారి జె. వేణుగోపాల్, డీడీవో పి. వాసుదేవరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## చిన్నారి రియాన్సీ గ్రేస్‌కు మంత్రి సుభాష్ అండ

**వైద్య ఖర్చులు భరిస్తానని భరోసా**



**రామచంద్రపురం, పెన్ పవర్, సెప్టెంబర్ 28** : పుట్టిన నాలుగు నెలలకే గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న చిన్నారి రియాన్సీ గ్రేస్‌కు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అండగా నిలిచారు. పేదరికం కారణంగా చిన్నారికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించలేని పరిస్థితిలో ఉన్న తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తూ, వైద్యానికి అవసరమైన ఎల్ఓసీతో పాటు ఆపరేషన్ ఖర్చులను భరిస్తానని హామీ ఇచ్చారు. రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామం శివారు చింతగుంట చెరువుకు చెందిన మేడిశెట్టి జీవన్‌కుమార్ --చంద్రిక దంపతుల నాలుగు నెలల చిన్నారి రియాన్సీ గ్రేస్ పుట్టుకతోనే గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. తరచూఆయాసపడుతుండటంతో తల్లిదండ్రులు పలు ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేయించగా, విజయవాడ ఆంధ్ర ఆసుపత్రి వైద్యులు చిన్నారి గుండెలో రంధ్రం ఉన్నట్లు గుర్తించి ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరమని సూచించారు. ఆపరేషన్ ఖర్చులు భరించే స్థోమత లేక తల్లిదండ్రులు మంత్రి సుభాష్‌ను ఆశ్రయించగా, ఆయన వెంటనే స్పందించి చిన్నారిని విజయవాడలోని ఆంధ్ర ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యులతో మాట్లాడారు. రెండు మూడు రోజుల్లోనే ఆపరేషన్ జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని వైద్యులను కోరారు. చిన్నారి వైద్యానికి అయ్యే ఖర్చును తాను భరిస్తానని తల్లిదండ్రులకు, వైద్యులకు హామీ ఇచ్చి ధైర్యం కల్పించారు. తమ చిన్నారి ఆరోగ్యం కోసం ఆందోళన చెందుతున్న సమయంలో మంత్రి స్వయంగా ఆసుపత్రికి వచ్చి వైద్యులతో మాట్లాడి అండగా నిలవడంపై తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారి రియాన్సీ గ్రేస్‌కు శస్త్రచికిత్స విజయవంతమై సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

## ఐఎఫ్టీయూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి




**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** అక్టోబర్ 3, 4 తేదీల్లో రాజమండ్రిలో జరిగే ఐఎఫ్టీయూ రాష్ట్ర మహాసభలను అన్ని రంగాల కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. పెదపళ్ళ వాటర్ ట్యాంక్ వద్ద సోమవారం రాష్ట్ర మహాసభల పోస్టర్లను రైస్ మిల్ జట్టు కార్మికులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ జట్టు నాయకులు నల్ల శ్రీను, పిల్లి శ్రీను, బండ రామచంద్ర రావు, పూలమాటి హరిబాబు,కోసూరి జగన్నాథం, తాడాల శ్రీను, కొండేపూడి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ రెవెన్యూ సహాయకుల నిరసన దీక్షకు లాయర్ల సంఘీభావం




**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** ఆలమూరు ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయకులు చేస్తున్న నిరసన దీక్షకు సోమవారం పలువురు న్యాయవాదులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా మండల వీఆర్ఏల సంఘ అధ్యక్షుడు తాతపూడి ఇస్సాక్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పే స్కేల్ ఇవ్వాలని, అర్హులైన వారికి పదోన్నతి కల్పించాలని, మరణించిన వీఆర్ఏ కుటుంబాల్లో ఒకరికి కారుణ్య నియామకం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా గ్రామ రెవెన్యూ సహాయకులకు తగిన వేతన స్కేలు అమలు చేయాలని కోరారు. చాలీచాలని వేతనాలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలను మెరుగైన విద్యను అందించే పాఠశాలల్లో చదివించుకునే స్థోమత కూడా లేకుండా పోయిందని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించాలన్నారు. ఆలమూరు మండల గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సెక్రటరీ కె శివరామారావు, ఉపాధ్యక్షుడు భువనగిరి ఏసు, సలహాదారుడు నాగేశ్వరరావు, మండల వీఆర్ఏలు దీక్షలో పాల్గొని నినాదాలు చేశారు.?

## అధికారులు హామీతో శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం రిలే దీక్ష విరమణ.....





- **తక్షణమే రహదారి మరమ్మత్తులు, నూతన రహదారి నిర్మాణానికి త్వరలోనే నిధులు విడుదల....**
- **బైపాస్ రహదారి భూ సేకరణ పనులను త్వరలోనే పూర్తి చేస్తాం....**
- **దీక్షా పరులకు హామీనిచ్చిన ఆర్ అండ్ బి ఇఇ రాఘవరావు, డిఎస్పీ తిలక్, తహశీల్దార్ సూరిబాబు....**

**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 28:-** శంఖవరం గ్రామంలో మైనింగ్ టిప్పర్ల రాకపోకల సమస్యను పరిష్కరించా లని, గ్రామంలో గుంతలు పడిన రహదారిని నూతనంగా నిర్మించాలని శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం డిమాండ్ చేస్తూ తలపెట్టిన రిలే నిరాహార దీక్ష 4వ రోజుకు చేరుకోవడంతో ఆర్ అండ్ బి ఇఇ వి రాఘవరావు, పెద్దాపురం డిఎస్పీ తిలక్,
తహశీల్దార్ ఎం సూరిబాబు హామీనిచ్చి దీక్ష విరమింపజేసారు. గత కొన్నేళ్ళుగా శంఖవరం గ్రామ ప్రజలకు మట్టితో కూడిన కాలుష్యాన్ని వెదజల్లుతూ, దారుణమైన ట్రాఫిక్ అంతరాయానికి కారణ భూతాలైన భారీ టిప్పర్లతో ప్రజలు అనారోగ్యం పాలుకావడం, ప్రమాదాలకు గురికావడం ఈ ప్రాంతంలో సర్వ సాధారణంగా మారిపోయింది. దీనితో విసిగి, వేసారిపోయిన శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం ఈ సమస్య పరిష్కారినికై గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని రిలే నిరాహార దీక్షకు పిలుపు నిచ్చింది. దీనితో ఈ నెల 25న ప్రారంభించిన రిలే నిరాహార దీక్ష నేడు (28న) 4వ రోజుకు చేరుకుంది. శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం చేపట్టిన ఉద్యమానికి ప్రజల మద్దతుతో పాటు పత్రికలు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డుకు పడిన గుంతలు, ప్రమాదాలు విపరీతంగా వైరల్ చేసాయి. ఈ ఉద్యమానికి రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన బిజెపి జిల్లా పూర్వ అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్, వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి అంగూరి లక్ష్మీ శివకుమారి, కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు ఇన్చార్జ్ ఉమ్మిడి వెంకట్రావు, బిసివై పార్టీ ఇన్చార్జ్ గొంపా శివకుమార్ యాదవ్, బిఎస్పీ పార్టీ ఇన్చార్జ్ గునపర్తి అపురూప్ శంఖవరం గ్రామ ప్రధాన సమస్యపై పోరాడుతున్న గ్రామ అభివృద్ధి సేవా సంఘం దీక్షకు తమ సంఘీబావం తెలిపి, మద్దతు నిచ్చి సమస్య పరిష్కరించబడే వరకు అండగా నిలుస్తామన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యమానికి గ్రామంలోనూ, సమీప గ్రామాల ప్రజల నుండి మద్దతు పెరగడంతో ఉద్యమ తీవ్రత పెరుగుతుండడంతో అధికారులు చొరవ చూపి అభివృద్ధి సంఘం చేసిన డిమాండ్లను ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభకు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. దీనితో తక్షణమే శంఖవరం గ్రామ రహదారిపై అతి దారుణంగా పడిన గోతులను గుర్తించిన ఆర్ అండ్ బి అధికారులు 590 మీటర్లు మేర 1కోటి 50లక్షల రూపాయులతో మరమ్మత్తులు చేసేందుకు నిధులను మంజూరు చేసి, దానికి సంబంధించిన అనుమతి పత్రాన్ని దీక్షా శిభిరం వద్దకు ఆర్ అండ్ బి ఇఇ రాఘవరావు, డిఇ శేషుకుమార్, జెఇ రజని, పెద్దాపురం డిఎస్పీ తిలక్, సిఐ సూర్య అప్పారావు, ఎస్సై శ్రీహరిబాబు, తహశీల్దార్ ఎం సూరిబాబు చేరుకున్నారు. దీక్షలో ఉన్న సంఘం అధ్యక్షుడు మేకల కృష్ణ, ఉపాధ్యక్షుడు గునపర్తి అపురూపు, కార్యదర్శి
పర్వత రామకృష్ణ, సహాయ కార్యదర్శి పగడాల మోహన సన్యాసిరావు, కోశాధికారి గుద్దాటి నాగేశ్వరరావు, సభ్యులు రేలంగి వెంకట సత్యనారాయణ, బొమ్మిడి సత్యనారాయణ, పడాల కృష్ణమూర్తి, బొర్రా సత్తిబాబు, బత్తిన తాతాజీ, కొంగు రమేష్ లకు ప్రభుత్వం విడుదల చేసిన మంజూరు పత్రాన్ని తహశీల్దార్ సూరిబాబు చదివి వినిపించారు. అలాగే త్వరలోనే శంఖవరం గ్రామంలోని 3 కిలోమీటర్ల మేర నూతన రహదారి నిర్మాణానికి 5కోట్లు నిధులు కూడా త్వరలోనే మంజూరు కానున్నాయని ఆర్ అండ్ బి ఇఇ రాఘవరావు పేర్కొన్నారు. అలాగే బైపాస్
రహదారి నిర్మాణానికి 3 మార్గాలను పరిశీలించామని, వీటిని మరలా ఆర్ అండ్ బి అధికారులు, మండల సర్వేయర్లు, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించి, నివేదికను ఎమ్మెల్యే సత్యప్రభకు, జిల్లా కలెక్టర్ కు
నివేదిస్తామని, వచ్చే ఆరు నెలల్లోనే పనులు పూర్తి కావచ్చని తహశీల్దార్ సూరిబాబు దీక్షా శిభిరం వద్ద
వివరించారు. అనంతరం అధికారులు దీక్షాపరులతో చర్చించి, వారికి అధికారులు, గ్రామస్తులు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేసారు. శంఖవరం గ్రామ ప్రజల డిమాండ్ల సాధనతో రిలే దీక్షలు ప్రశాంతంగా ముగియడంతో గ్రామస్తులు, శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం ఆనందం వ్యక్తం చేసారు.

## అవగాహనతోనే నులిపురుగుల నిర్మూలన

**మండలంలో 96.79 శాతం మేర లక్ష్యం పూర్తి**



**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** బాలల శారీరక క్షీణతకు కారణమయ్యే నులిపురుగుల నిర్మూలన కోసం అవగాహనతో పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ ఏ రాజు, ఎంఈఓ బి.అప్పాజీ, చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎన్.లక్ష్మీ స్నేహలత, డి.సాయి కిషోర్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా పీహెచ్‌సీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో ఉపాధ్యాయ, వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది సోమవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేశారు. మండలంలోని రెండు పీహెచ్‌సీ పరిధిలోనున్న 18 గ్రామాల్లో 49 ప్రభుత్వ, 13 ప్రైవేటు పాఠశాలలు, 76 అంగన్‌వాడీ కేంద్రాలు, రెండు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో 11984 మందికి అల్బెండజోల్ మాత్రలను మింగించవలసి ఉంది, దీంతో చొప్పెల్ల పీహెచ్‌సీ పరిధిలోనున్న 6805 మందికి గాను 6568 మంది, పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో 5179 మందికి గాను 5032 మందికి ఈఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు, దీంతో మండలంలో 95.35 శాతం మేర ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ జరిగినట్లు ఆయా పీహెచ్‌సీ వైద్యాధికారులు పేర్కొన్నారు. మిగిలిన బాలలకు వచ్చేనెల అక్టోబర్ మూడున ఆల్బెండజోల్ మాత్రలను అందించనున్నామని వైద్యాధికారులు తెలిపారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ బి,సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్,ఆర్,బాలామణి, ప్రిన్సిపాల్ నల్లమల్లి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక





**ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 87 ఫిర్యాదులు**

**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 28**: కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ప్రజల నుంచి 87 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల్లో 23 భూ తగాదాలకు, 26 కుటుంబ కలహాలకు, మరో 38 ఇతర సమస్యలకు సంబంధించినవిగా అధికారులు గుర్తించారు. ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించిన అనంతరం తక్షణమే చట్టపరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులను ఆదేశించారు. అలాగే ఫిర్యాదులపై ఏడు రోజుల్లోగా విచారణ పూర్తి చేసి,తగిన పరిష్కారం చూపడంతో పాటు వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ప్రజల సమస్యలను న్యాయపరంగా పరిష్కరించి వారికి త్వరితగతిన న్యాయం అందించడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని ఎస్పీ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కాకినాడ జిల్లా పోలీసులు పూర్తి నిబద్ధతతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

## గత ప్రభుత్వంలో ఏమి చేశారని పదేపదే మాట్లాడటం సరి కాదు...

**టిడిపి నాయకులకు వైసీపీ స్ట్రాంగ్ వార్నింగ్....**

**శంఖవరంపెన్ పవర్ సెప్టెంబర్ 28:-** కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి లో వైసిపి పార్టీ కార్యాలయం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. వైసిపి మండల పార్టీ అధ్యక్షులు నరాల శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి జిల్లా ఎసీ సెల్ అధ్యక్షులు శెట్టిబత్తుల కుమార్ రాజా, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి అడపా సోమేష్, నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు సకురు గుర్రాజు,మాజీ జడ్పీటీసీ ఈగల అప్పారావు, యడ్ల సత్యనారాయణ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై పనిచేస్తుందని అన్నారు, శంఖవరం గ్రామం లో రోడ్డు సమస్యపై గ్రామ అభివృద్ధి కమిటీ నిరసన చేపట్టిందని వారి పిలుపుమేరకే ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ ముద్రగడగిరి బాబు తోపాటు పార్టీ శ్రేణులు మద్దతు ఇచ్చామని తెలిపారు. దీనిపై టిడిపి స్థానిక ఎన్నికలు సాకుతో రాజకీయం చేస్తుందంటూ పాత్రికేయ సమావేశంలో మాట్లాడటానికి ఖండిస్తున్నామని అన్నారు. శంఖవరం రహదారి సమస్యపై కూటమి పార్టీలో ఒకరైన జనసేన నిరసన తెలిపిందని, ఇదే కూటమిలో ఉన్న బిజెపి పార్టీ మద్దతు ఇచ్చిందని గుర్తు చేసుకోవాలని అన్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ ఆహ్వానం మేరకే మా నాయకులు గిరిబాబు శంకవరం గ్రామం సమస్యపై మద్దతు పలికారని, దీనిలో ఏ విధమైన రాజకీయ ఉద్దేశ్యము లేదని అన్నారు. అభివృద్ధికి సహకరిస్తామని సమస్యలపైనే పనిచేస్తామని ఈ సందర్భంగా వారు మీడియా ముందు వెల్లడించారు. గ్రామంలో రోడ్డు మరమతులకు స్థానిక ఎమ్మెల్యే కోటి 50 లక్షల రూపాయలు నిధులు తీసుకురావటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అయితే ఈ నిధులతో అక్కడ సమస్య పూర్తి పరిష్కారం కాదని తెలిపారు. ముఖ్యంగా శంఖవరం బైపాస్ నిర్మాణం కోసం గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ శక్తి వంచన లేకుండా కృషి చేశారని దానికి నేనే సాక్ష్యమని ఎస్సీ సెల్ అధ్యక్షులు కుమార్ రాజా మీడియా ముఖంగా వెల్లడించారు. నిన్న జరిగిన టీడీపీ పాత్రికేయ సమావేశంలో గత ప్రభుత్వంలో ఏమి చేశారని పదేపదే మాట్లాడటం, స్థానిక ఎన్నికల కోసం రాజకీయం చేస్తున్నారనడం సరికాదన్నారు. భారీ వాహనాల వల్ల గ్రామాలలో ప్రజలకు ఇబ్బంది లేకుండా బైపాస్ రోడ్ నిర్మించాలని, అభివృద్ధికి మేము సహకరిస్తామని ఈ సందర్భంగా మీడియా ముఖంగా తెలిపారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com